# వూదా చీర

—ఏమే, కాంతం, రేపు సుబ్బి వస్తుంది.

—ఏ సుబ్బి.

—మా అత్తయ్య కూతురు.

—ఎందుకో?

—ఎందుకంటావేమిటి మొన్న మీ అక్కయ్య ఎందు కొచ్చింది.

—చూడటానికి.

—అల్లాగే ఇది.

—ఎవరిని చూడటానికి?

—నిన్ను

—నన్నెందుకు చూడటానికి వస్తుందీ మీరు ఉండగా అన్నది కాంతం.

—నేను సుబ్బిని చూచి చాల కాలమైనందున ఉవ్విళ్ళూరుతున్నాను ఆమెను చూడటానికి. మరునాడు తెల్లవారుఝామున నాలుగు గంటలకు తెలతెలవారుతుండగా సుబ్బి మా యింటిముందు బండీ దిగింది. ముందు ఎదురుగా కాంతంవచ్చి పలుకరించి ఆమెను యింట్లోకి తీసుకొని వెళ్ళింది. నేను మాట్లాడక ఊరుకున్నాను. సుబ్బి యింత చక్కని దౌతుందని ఎప్పుడూ అనుకోలేదు. పల్లెటూళ్ళో పెరగటం చేత ముఖము బస్తీపిల్లలలాగు కాంతిహీనంగా లేదు. కన్నులు



కాంతులను వెదజల్లుతున్నవి బింబఫలములబోలు అధరమూ నొసట పెద్ద సాదుబొట్టూ, ఆమె సౌందర్యమునకు వన్నె దెస్తున్నవి.

బాలసూర్యుని అరుణరాగప్రసారము ఆమెకొక వింత సౌందర్యమును కలిగించినది.

నేను సుబ్బమ్మనుచూచి నిలువున నిలబడ్డాను. నోరువిప్పి పలుకరించ లేకపోయినాను. ఆమె సౌందర్యము నన్ను వశపరచుకొన్నది. సౌందర్యమునకు వశీకరణశక్తి ఉందని నేను తెలిసికొన్నాను. సౌందర్యశకటమునకు నేను తెంపరాని గొలుసులతో బంధింపబడ్డాను. ఆ సౌందర్యమును ఆస్వాదించినకొద్దీ ఆకలెక్కువ. తాగినకొద్దీ దాహమెక్కువ.

సుబ్బమ్మ కాంతమ్మలు ఒకరికొకరూ సహాయం చేసుకొంటూ వంట తయారు చేశారు. సకాలానికి సుబ్బమ్మ "బావగారూ వంట అయింది. అక్కయ్య స్నానం చేయమంటున్న"దని మృదు మధుర స్వరంతో కోయిలలాగు పలికింది. ఆపలుకులు నా హృదయవంచిపై తగిలినవి. తంత్రులు కదలి మోగినవి. నిశ్చేష్టుడనయి చూస్తూ స్వప్నావస్థలో ఉన్న నన్ను సుబ్బమ్మ మళ్ళీ లేపింది.

—స్నానానికి లేవచ్చునంటున్నది అక్కయ్య.

—సరే, వస్తాగాని అత్తయ్యకు ఉబ్బసం నయమేనా?

—ఏం నయం బావా! అల్లాగే బాధపడుతున్నది. ఎండాకాలం నాలుగు నెలలూ కాస్త తెరిపి. వానకాలంలో దాని

బాధ చూడలేము.

—తరువాత ఏమాటా మాటాడక నేను "తెనాలిలో మీ అత్తగారు కులాసాగా ఉన్నారా?" అని అడిగాను.

—ఆ విషయమై సుబ్బమ్మకు మాట్లాడటం ఇష్టంలేక కాబోలు 'అల్లాగే' అని మూడు అక్షరాలతో కొట్టివేసింది.

—నిన్ను జూచి చాలారోజులయింది. ఇంతలో ఎంత పెద్ద దానవయినావు.

—మీకు నామీద దయవుంటే—

—అని ఏమో చెప్పబోతుండగా కాంతం గుమ్మంలో కనిపించింది. ఏమిటో మరదలితో సరాగాలాడుతున్నారు! భోజనానికి లేవండి ముందు. తరువాత మీ యిష్టం. అని చురుకు గొంతుతో అన్నది.

నాకు కాంతం ఇట్లా రావటం ఇష్టం లేకపోయినా వెంటనే భోజనానికి లేవక తప్పిందికాదు. నేను "అది కిన్నెరస్వరం. ఇది బొంగురుగొంతు" అని ఏమోగొణుక్కుంటూ లేచిస్నానం చేసి భోజనందగ్గిర కూర్చున్నాను.

సుబ్బమ్మ గడపఅవతల భోజనం చేస్తున్నది. కాంతం వడ్డిస్తున్నది. నేను సుబ్బిని చూస్తూ భోజనం చేస్తూన్నాను. అట్లాచేయటం తప్పని తెలుసును. కాంతం అనుమానిస్తుంది అని భయపడ్డాను. కాని ఏమి చేయగలను? సౌందర్యము నన్ను వశపరచుకొని అట్లా యీడుస్తున్నది. కాంతంవైపు చూచి ఎందుకో ఒక చిరునవ్వు నవ్వినాను కాని ఆ చిరునవ్వు కాంతులు సుబ్బమ్మపై ప్రసరించినట్లు కాంతానికి అనుమానం కలిగింది.



—మీరు సరిగా భోజనం చెయ్యడం లేదన్నది కాంతం కషాయితకంఠంతో.

నేను మాట్లాడలేదు. అప్పుడే సుబ్బి పెదవులు ఎందుకో కదలుతున్నవి. అది చూస్తున్నాను. పెదవులు కదలినవి. ధ్వని బయలుదేరింది.

—మేము వస్తే బావగారికి దిగులు వేసిందేమో" అని పల్లెటూరి హాస్యపు మాట ఒకటి అన్నది.

నేను మాట్లాడక ఆ మాటలు వినటంలో శ్రవణసౌఖ్యం అనుభవించాను.

నిజంగా నేను ఆరోజు ఏమి భోజనం చెయ్యలేదు. ఇంతలో సుబ్బమ్మ భోజనం కావటంవల్ల నేనుకూడా మజ్జిగతో పూర్తి చేసి లేచినాను. భోజనానంతరం ముగ్గురమూ చాపమీద కూర్చున్నాము. కాంతం తమలపాకులు యీనెలతబుకులో పెట్టుకొనివచ్చి ముందు పెట్టి తాను కూర్చున్నది. మేము ముగ్గురము ఏమేమో మాట్లాడుకొన్నాము. సుబ్బమ్మ చుట్టి ఇచ్చిన తమలపాకులు నేను పుచ్చుకొన్నాను. కాంతం అక్కడే కూర్చుని తమలపాకులు వేసికొంటున్నది. నేను తనను తమలపాకులుచుట్టి యివ్వమనలేదని కాంతం మనసు అసూయతో మండిపోతున్నది. ఎందుచేతనోగాని నేను సుబ్బమ్మవైపు చూచినప్పుడల్లామా కాంతంహృద

యంలో అగ్నిజ్వాలలు ప్రజ్వరిల్లుతున్నవి. ఇప్పుడు జరిగిన మరొక విషయం ఆ అగ్నిని మరింత ప్రజ్వరిల్లజేసినది. తమలపాకులు అందించేటప్పుడు సుబ్బమ్మ చిటికెనవేలు నా చేతికి కొంచెం తగిలింది. కాంతం అది కళ్లారా చూచింది. నా ఒళ్ళు పులకరించింది. దేహం చిరుచెమ్మటలు గ్రమ్మినది. సుబ్బమ్మకు పాపం ఆవిషయం తెలియదు. కాంతం హృదయసీమను, ఈర్ష్యాకోపాలు కారుచిచ్చులాగ కమ్ముకొన్నవి. అక్కడనుంచి చప్పునలేచి తన గదిలోనికి వెళ్ళిపోయింది.

౨

గదిలో పరుపుమీదపడి వెక్కివెక్కి ఏడుస్తున్నది. ఆ హృదయంలో కోపానలము ప్రజ్వరిల్లుతున్నది. వళ్ళు గాలికి రావాకులాగు నిలువునా కంపించిపోతున్నది. ఏమేమో తలపోస్తున్నది. వేడి నిట్టూర్పుసెగల జిమ్ముతున్నది. ఎన్నో భావతరంగములు ఆమె హృదయములో నుప్పొంగుతున్నవి. సుబ్బమ్మతో మాట్లాడినంతమాత్రాన కాంతానికింత విచారమెందుకు? ఆమె తలంపులేమో ఎవరు చెప్పగలరు. ఆమె ఏమేమో తలపోసి ఏడుస్తున్నది. ఇంతలో పకపకమని నవ్వు వినవచ్చినది. కాంతం ఏడ్పుమాని ఆ నవ్వు విన్నది. ఆ నవ్వు దొంతరలు ఒకటితరువాత నొకటిగా బయలుదేరి మెల్లగా



సన్నగిల్లి అంతరించినవి. అప్పుడు కాంతానికి హృదయం పగిలిపోయేటట్లు దుఃఖం పొంగి పొరలువచ్చింది. ఒక్కమారుగా సుబ్బమ్మ బుర్ర బద్దలు చేద్దామని బుద్ధి పుట్టినది. కాని తిరిగి ఏడ్వ మొదలుపెట్టినది.

మరికొంచెం సేపటికి నేను బయటికి వెళ్ళడానికి బయలుదేరి కాంతం గదిలోకి వచ్చాను. కాంతం యీలోకంలో లేదు. దుఃఖసముద్రంలో మునిగిఉన్నది. నావైపు చూడలేదు. నేను ఆమె దరిని కూర్చొని గడ్డం పట్టుకొని కాంతం ఎందుకే కోపం? అన్నాను. నా రెండుచేతులను కాంతం విదిలించివేసింది. ఇంకా నయం! కృష్ణుణ్ని సత్యభామ చేసినట్లు, ఎడమకాలితో తన్నిందిగాదని నేను మనస్సుకు సమాధానం చెప్పుకొని తిరిగి ఓదార్చటానికి ప్రయత్నం జేశాను.

—అయ్యో పిచ్చిదానా ఎందుకే విచారం.

—ఎందుకా నా కర్మానికి, నేను చక్కనిదానను కానని.

—కాకపోతే ఇప్పుడు ఏమి నీకు లోపం?

—ఏమీ లేదు. ఎవరైనా చక్కనివాళ్ళు వస్తే నన్ను జూడరు.

—అయ్యో వెర్రిదానా ఇదా నీగొడవ. సుబ్బమ్మవైపు చూచాననా! చూచినంతమాత్రాన తప్పేమిటి.

—తప్పేమిటి చూచినా తప్పులేదు. తమలపాకులు చుట్టించి పుచ్చుకొన్నా తప్పులేదు. మరి అని ఏమో చెప్పబోయి ఏడ్చింది కాంతం.

—సరేలే. కాంతం ఊరుకో. నీ విచారంలో నాకేమీ అర్థం కనపడదు. సుబ్బమ్మ సౌందర్యవతి. దానిని నేను చూచాను. అది తప్పా! ఎవరివంకా చూడనేకూడదూ! రోజూ ఎన్ని సౌందర్యమయములైన వస్తువులను చూస్తున్నాము. ఎన్నిటి సౌందర్యాన్ని అనుభవిస్తున్నాము. అందులో తప్పేమి? గులాబిపూవును జూచి ఆనందించటంలేదా? దానిని వాసన జూడటంలేదా. గులాబిపువ్వును జూస్తే ఎటువంటి ఆనందమో సుబ్బమ్మను జూచినా నాకట్టి ఆనందం కలిగింది. ఇందులో నా దోషం లేదు. నాకేమీ పాపచింత లేదు. అని ఏమేమో లెక్చెరు ఇచ్చినాను.

—కాంతంవిని ఊరుకొని మీరు చెప్పిన విషయం ఆడవాళ్ళకు కూడానా. ఒక స్త్రీ మఱొక పురుషుని సౌందర్యాన్ని మెచ్చి ఆతనితో సరసాలాడవచ్చునా!

—ఆహా! అందులో ఏమీ తప్పులేదు. మాట్లాడినంత మాత్రాన లోపములేదు. ప్రకృతిలో సౌందర్యముగల ఏవస్తువునైనా సౌందర్యముకొఱకే ప్రేమించవచ్చును.

—సరే లెండిఅన్నది కాంతం. నేను షికారువెళ్లాను.

## ౩

కాంతం మరునాటినుంచి యథాప్రకారం గృహకృత్యములు నిర్వర్తించుకొంటున్నది. ఆడవాళ్ళకు కోపం బోగొట్టే



మార్గంలో ఒకటి ఏమైనా కొని యివ్వటం. కొత్తచీర ఒకటి కొనియదలచి నేను బజారుకు వెళ్ళినాను. షాపులలో తిరిగి బేరంచేసి మంచి అందమైన ఊదా చీర ఒకటి బేరంచేసి కొన్నాను. ఆచీర చాలా బాగుంటుంది. ఎప్పుడు కాంతానికి ఆచీర చూపుదామా అని ఆతురపడుతూ వేగిరం నడచినాను. దారిలో ఒక ముసలమ్మ ఒక యువతీ వస్తున్నారు. ఆచీర చూచి ఆయువతి, ముసలమ్మతో, ఏమోఅన్నది. ముసలమ్మ నన్ను ఆపి "నాయనా ఆచీరఎంతకుకొన్నావు" అన్నది. పది రూపాయలు అన్నాను నేను. ఆమె ముఖకమలము ముకుళించినది. నిరుత్సాహంతో కాబోలు-ఆమె నిట్టూర్పు విడిచింది. నేను ఆచీరను అటు త్రిప్పి ఇటు త్రిప్పిచూస్తూ యింటికి వరు గెత్తినాను. దారిలో మరి ఇద్దరు యువతులు ఆచీరవంక చూచినారు: కాని అడగటానికి భయంవేసి ఊరుకొన్నారు. ఇంటికి రావటంతోనే కాంతం వికసించిన హృదయంతో నేను తెచ్చిన బహుమానాన్ని అందుకొని, చాలా బాగుందని తన సంతోషమును వెలిపుచ్చినది. వెంటనే కట్టుకోమని నేను బలవంత పెట్టాను. వర్జం జూచి భోజనానంతరం కట్టుకొంటానని కాంతం అన్నది. సాయంత్రం జడ వేసుకొని మల్లెపూలు పెట్టుకొని చీర ధరించింది. నాపాదములకు నమస్కారము చేసినది. నేను కాంతం ముఖమును పైకెత్తి ముద్దుపెట్టుకొన్నాను ఆప్రణయకలహం ఈసంధితో ముగిసింది.

౪

ఆచీర కాంతానికి మక్కువ ఎక్కువ అయింది. ఎల్లప్పుడూ ఆ చీరనే కట్టుకొనేది. పగలల్లా పనిలో ఏచీర కట్టుకొన్నా సాయంత్రం కావటంతోనే ఆచీర ధరించేది. నేనుకూడా ఆచీరనుజూచి కాంతాన్ని గుర్తించేవాడిని.

ఒక రోజున కాంతం సోదరి వచ్చింది. కాంతం అక్కకు కాంతానికి ఆట్టేవయస్సులో వ్యత్యాసములేదు. కొంచెం హెచ్చు తగ్గుగా ఒక్కరూపునే ఉంటారు. దూరాన్నించి చూస్తే పోల్చుకొనటం కష్టం.

ఆరోజునక్లబ్బులో సభ జరగటంచేత నేను ఆలస్యంగా యింటికి వచ్చాను. రోజూ వీధితలుపు తెరచి ఉండేది. కాంతం గడపలోనే లాంతరు పెట్టుకొని కూర్చునే వాడుక. ఈరోజున తలుపు వేసిఉంది. లోపలయేమైనా పనిలో ఉండవచ్చునని తలుపు నెట్టబోవు సమయమున లోపటినుంచి నవ్వు వినవచ్చినది. అది యేమిటో కనుగొనవలెనని నేను మెల్లగా దొడ్డివైపు వెళ్లాను. నాపడకగది కిటికీతలుపు తెరచిఉన్నది. లోని దీపంమాంద్యముగా వెలుగుతున్నది. కాంతంఊదాచీర గట్టుకొని గోడనానుకొని ఉన్నది. గదివాకిట కాంతానికి ఎదురుగా పురుషవిగ్రహము కానవచ్చినది. అతను గడపపై నిల్చుండి కాంతంతో ఏమో మాట్లాడుతున్నాడు. కాంతం నవ్వుతూ తలవూపినది. ఇంతలో ఆపురుషవ్యక్తి కాంతం చెయ్యిపట్టుకొని చిటికెనవ్రేలినున్న ఉంగరమును పరీక్షించింది.

"కాంతం! తలుపు తలుపు" అని అరచాను. ఊదాచీర గట్టుకొన్న కాంతం వచ్చి తలుపుతీసి వెంటనే పెరటిలోనికి పరుగెత్తినది. ఆమెదొంగతనము చేస్తుండగా పట్టుబడిన దొంగవలె మొగ మావలకు తిప్పి పరుగెత్తినదని నేను అనుకొన్నాను. కాంతం వైఖరిచూస్తే తప్పుచేసిన మనిషిలాగ కనిపిస్తుంది. రోజూనవ్వుతూవచ్చి ఏమేమో మాట్లాడేది. ఈరోజు నావద్దకు రాలేదు. నాతో మాట్లాడలేదు. అంతరాత్మ బాధపెట్టక తప్పదు అనుకున్నాను. కాంతంను యిప్పుడు మాట్లాడించినా లాభములేదని ఆవచ్చిన పురుషుడెవడో కనుగొనవలెనని వదినగారిని పిలిచినను వదినగారు దొడ్లోనుంచి "వస్తున్నా వెంకట్రావు! మడిగట్టుకొంటున్నా" అన్నది.

—కాంతం ఏది?

—దొడ్లో ఉన్నది.

నాకు హృదయములో కోపాగ్ని ప్రజ్వరిల్లుతున్నది. ఎవరో ఒకరు కాంతం చెయ్యిపట్టుకొని వ్రేలినున్న ఉంగరమును పరీక్షించినారు. ఆమాట తలుచుకొన్నప్పుడెల్ల ఒళ్ళు మండిపోయినది. ఇద్దర్ని కొడదామని బుద్ధిపుట్టి ఒళ్లు తెలియని కోపంతో గదిలోనికి తూలుతూ వెళ్లినాను. అక్కడ అటు ముఖంపెట్టి కుర్చీలో కూర్చునిఉన్న పురుషుడిని చూచినాను. ఆతను ఒకమూల మంచానికి ఆనుకొని కుర్చీవేసుకొని

కూర్చున్నాడు. ఇతరులు వచ్చినను కనపడకుండటానికి కాళ్ళోలు దోమతెర కొంచెము తనను మరుగుపరచేటట్లు వేసుకొన్నాడు. కాని పైన వేసుకొనిన ట్వీడుకోటు సిల్కు తలగుడ్డ కనబడుతునేఉన్నవి. పాదములు కనిపించడంలేదు. నేను లోనప్రవేశించి

—ఎవరోయి నీవు? అన్నాను.

—మాట్లాడలేదు.

—ఎవరునీవు మాట్లాడవేమి?

—జవాబులేదు.

నాకు దేహం కంపించిపోతున్నది.

నాగదిలో జేరి మాట్లాడవేమి రాస్కెల్ అని చేయి విసరినాను. కాని అది గురితప్పి మంచం స్తంభమునకు తగులుటచే తీవ్రమైన కోపం గలిగి నిమిషమాత్రంలో తూలి ఆతనిపై బడుతూ లాగి మళ్ళీకొట్టాను. ఆదెబ్బ ఆపురుషుని తల గుడ్డపై తగిలి తలగుడ్డ ఊడి వ్రేలాడింది. అప్పుడు నేను నిర్ఘాంతపోయినాను. నాకిప్పుడు మెళకువ వచ్చినట్లయింది. నేను దేనిమీద తూలానో ఆమూర్తి స్త్రీవిగ్రహంకాని పురుషవిగ్రహంకాదు. తలపైన నాగరంవుంది. ఆవిడ జారుజడ వేసుకొన్నది. మొగమున చిరుచెమ్మటలు గ్రమ్మినవి. వెంటనే ఆమె కోటువిడిచి పారవైచి పొంగిపొంగివస్తూన్న నవ్వును ఆపుకొనడానికి నోటిమీద చేయిపెట్టుకొని పెరటి లోనికి పరుగెత్తినది.



పెరట్లో వదినగారు, "కాంతం కాంతం ఆగవే! ఇంకా ఎక్కడికి పరుగెత్తుతావు! అయ్యో ఇల్లాకూర్చో!" అని మంచంమీద కూర్చోబెట్టి- ఏమిటే-అన్నది—

—ఏముంది మనం అనుకొన్నట్లు- అని నవ్వింది కాంతం

—అబ్బ! నవ్వు ఆపుకొని చెపుదూ!

—అక్కయ్యోయి. వారు నన్ను కొట్టబోయి అని చెప్పలేక పక్కలు పట్టుకొని కాంతం నవ్వుతున్నది.

—కొట్టబోయి ఆ-చెపుదూ—

—తానె స్థంభానికి కొట్టుకొన్నారు, అని విరగబడి నవ్వింది.

పడకగదిలో నేను నిర్ఘాంతపోయి కూర్చున్నాను. నాకు ఈనవ్వుమాత్రం వినవచ్చినది. ఆనవ్వు అలలు అలలుగా బయులుదేరి గాలిలో కొట్టుకొని పోతున్నది. నేను చిరునవ్వు నవ్వినాను.

"మీఆయన్ని భోజనానికి పిలవ్వే" అన్నది కాంతం సోదరి.

—నేనుపోలేనమ్మ నీవుపో

నాకుమాటరావడంలేదు. నువ్వేపో! నేను నవ్వు ఆపుకోలేను. నవ్వుతే బాగుండదు. నేనుపోను అన్నది కాంతం.

కాంతం సోదరి తప్పనిసరిగావచ్చి భోజనానికి పిలిచింది. భోజనానంతరం తమలపాకులు చుట్టి. పరువుపైనపెట్టి కాంతం విరగబడి నవ్వుతున్నది.

సరేగాని నువ్వు ఘుగవేషం వేసుకుంటే సీ చీరకట్టు కొన్నది మీ అక్కయ్యా! అని నేను అడిగినాను.

అవును అని కాంతం హేళనచూపుతో నావైపుచూస్తూ

మీ కంతకోపం ఎందుకు! పరపురుషునితో మాట్లాడితే కోపం లేదుగా! అన్నది.

సరిలే ఊరుకో! ఎవరికైనా వాళ్ళు తెలియదు. ఆ సమయములో?

ఇప్పుడైన బోధపడ్డదా!

ఆ దెబ్బ తగిలిందా?

దెబ్బ తగిలితే ఎఱుగరూ. ఈ తమలపాకుల ప్రాప్తి లేకపోయేదే. మీకే యీదెబ్బ......అని తన విజయాన్ని సూచిస్తూ ఓరగన్నులతో నవ్వింది. మిగలబండిన తమలపాకులవంటి కాంతం చెక్కిళ్ళు కెంపెక్కడము చూస్తూ అదే పనిగా తమలపాకు మడుపులు నోటితో అందుకోసి నములుతున్నాను. మడుపులు అందిస్తూవున్న చేతిని విదిలించి అబ్బా! అన్నది కాంతం——

# మా కాంతం

కాంతం నామీద విరోధం కట్టింది. పెద్ద యుద్ధం గింది. ఆమె ఆఖరుకు అశ్రుధారాస్త్రము ప్రయోగించింది.

అంతవరకు ఎందుకొచ్చిందంటారు! అసలు సంగతి మీకు మూడు ముక్కలలో చెప్పేస్తాను. కాంతం నన్నేమో వట్టి తెలివితక్కువ నాగన్న క్రింద కట్టేస్తుంది. ఏదో నేనూ బి. ఏ, దాకా చదువుకొన్నానా! కొద్దో గొప్పో ఆంధ్ర వాఙ్మయంలో కూడా నాకు పరిచయం ఉందా. కవిత్వం చెప్పలేకపోయినా పద్యం అర్థం చేసుకోగలను గదా మరి నన్ను బట్టుకొని వట్టి తెలివితక్కువ ఫుల్లాయ్యక్రింద జూస్తే వళ్ళు మండదూ. నావళ్ళు మండి నేను నాలుగూ అనేశాను.

ఈ విషయంలోనే కాదు ప్రతి విషయంలో నన్ను గూర్చి సగౌరవంగా ప్రవర్తించదు. నేను బజారుకు వెళ్ళితే సరిగా బేరం చెయ్యందే ఏ వస్తువును తీసికొనిరాను. అయితే ఒక డబ్బు ఎక్కువయ్యినా మంచి సరుకు తెస్తాను. రెండు మూడు కొట్లు చూచి అక్కడ కొనేవాళ్ళను విచారించి ధర తెలిసికొని మరీ కొంటాను. అటువంటి సమయంలో ఎంత మంచి వంకాయలు తెచ్చినా ఇంటికి రావడంతోనే ఎబ్బే! ఇవ్వేమి వంకాయలు. గట్టిగా రాళ్ళలాగ ఉన్నవి. కరుకెక్కినవి. ఎవ్వరో మీకు టోపీ వేశారు. సీతమ్మ కొన్నది వంకాయలు! ఎల్లావున్నవి అనుకొన్నారు? లేత మొవ్వలు. కూర